


నెరవేర్చాడు



- ముఖ్యమంత్రి తొలి అడుగులపై హర్షం
- ఐదు ప్రధాన హామీలపై సంతకాలు
- స్వాగతించిన జిల్లా ప్రజలు
- కూటమి శ్రేణుల్లో మరింత జోష్

ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి అడుగుతోనే ప్రజలను అమితంగా ఆకట్టుకున్నారు. అన్ని వర్గాల నుంచి జేజేలు అందుకుంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ఆచరణకు పాలన ఆరంభంలోనే శ్రీకారం చుట్టడంతో వివిధ రూపాల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరుద్యోగులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు. చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. డీఎస్సీ అభ్యర్థుల ఆనందానికి అవధులే లేవు. తెలుగు తమ్ముళ్లు కూడా చాలా జోష్‌తో కనిపిస్తున్నారు. చంద్రన్న నిర్ణయాలకు సలాం చేస్తున్నారు. జనసేన, బీజేపీ శ్రేణులూ హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

పాలనా రథం ఎటువైపు సాగుతుందో చంద్రబాబు తొలి సంతకాలతో చెప్పకనే చెప్పేశారు. ఆదిలోనే అన్ని వర్గాలను ఆకట్టుకున్నారు. ముగిసిన ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లిన ప్రతిచోటా చంద్రబాబు డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని హామీ ఇచ్చారు. అన్నట్టుగానే గురువారం మొదటి సంతకం ద్వారా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి ఆమోదం తెలిపారు. తద్వారా నిరుద్యోగుల కల నెరవేరడానికి మార్గం సుగమం చేశారు. అలాగే వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, సామాజిక పింఛను రూ.4వేలకు పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, నైపుణ్య గణనపై వరుసగా సంతకాలు చేశారు. దీంతో ఇవి తక్షణమే కార్యాచరణకు రానున్నాయి. అధికార యంత్రాంగం ఈ అంశాలపై దృష్టి సారించనుంది.

మెగా డీఎస్సీ..

జిల్లాలో నిరుద్యోగ యువత అధికంగా ఉంది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వారిని తీవ్ర నిరాశకు గురిచేసింది. సచివాలయాల ఉద్యోగాలు మినహా ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వలేదు. జిల్లా ఉపాధి కార్యాలయంలో రెండున్న లక్షల మంది వివరాలు నమోదు చేసుకున్నారు. ఒక్క ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారే 60వేల మంది వరకు ఉన్నారు. ఈ నేపథ్యంలో మొదటి సంతకం మెగా డీఎస్సీపై చేయడం ద్వారా వారందరికీ చంద్రబాబు ఊరట ఇచ్చారు. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని వెల్లడించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు..

భూ యజమానుల్లో భయాందోళన కలిగించిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఈ చట్టంలోని నిబంధనలపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీనిని గుర్తించిన చంద్రబాబు రద్దుకు హామీ ఇచ్చారు. యాక్టు రద్దుకు రెండో సంతకం చేశారు. జిల్లాలో 2.6లక్షల మంది రైతులున్నారు. 5.5లక్షల ఎకరాల సాగులో ఉంది. రైతులే కాకుండా వివిధ కేటగిరీలకు చెందిన భూ యజమానులున్నారు. ఇప్పుడు వారంతా ఆనందపడుతున్నారు.

పింఛన్ మొత్తం పెంపు..

వృద్ధాప్య, వితంతు, సామాజిక పింఛన్లను రూ.4వేలకు పెంచుతున్నట్లు ప్రకటిస్తూ ఆ దస్త్రంపై చంద్రబాబు మూడో సంతకం చేశారు. ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగానే ఆచరించి చూపారు. దీంతో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే పెంచన్ల పెంపు అమల్లోకి రానుంది. జూలైలో రూ.4వేలు అందుకోనున్నారు. జిల్లాలో 2,82,194 మంది వివిధ రకాల పింఛనుదారులున్నారు. వీరికి ప్రతినెలా రూ.82.45 కోట్లు చెల్లిస్తున్నారు. తాజా పెంపుతో అదనంగా రూ.30 కోట్ల భారం పడనుంది.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ..

జిల్లాలో ప్రధాన పట్టణాల్లో అన్న క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం 2019లో వీటిని ఎత్తివేసింది. తిరిగి పునఃప్రారంభిస్తూ చంద్రబాబు నాలుగో సంతకం చేశారు. దీంతో వివిధ నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న అన్న క్యాంటీన్లు తిరిగి తెరుచుకోనున్నాయి. కొన్నిచోట్ల అన్నక్యాంటీన్ల భవనాలను వైసీపీ వివిధ కార్యాలయాలుగా మార్చేసింది. వీటిని ఖాళీ చేయించనున్నారు.

స్కిల్ గణాంక సేకరణ..

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలంటే వారు ఏం చదువుకున్నారు.. సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారు ఎంతమంది.. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, ఎస్‌జీటీ, బీఈడీ శిక్షణ పొందిన వారు ఎంతమంది.. కంప్యూటర్ విభాగాల్లో శిక్షణ పొందినవారెందరు.. తేలాల్సి ఉంది. ఆ వివరాలు సేకరించి అందుకనుగుణంగా అడుగులు వేయాలన్న తలంపుతో చంద్రబాబు ఐదో సంతకాన్ని స్కిల్ గణాంక ఫైల్‌పై పెట్టారు. జిల్లా నుంచి ఉపాధి అవకాశాల కోసం వివిధ ఐటీ కంపెనీల్లో చేరేందుకు పెద్దఎత్తున హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి వంటి నగరాలకు వలసపోతున్నారు. గణాంకాల సేకరణ ద్వారా ఉద్యోగ అవకాశాల రూట్ మ్యాప్ జిల్లాలోనే దొరుకుతుంది.

దివ్యాంగుల హర్షాతిరేకం..



బొబ్బిలి, జూన్ 13: చంద్రబాబునాయుడు తమకు ఇచ్చిన మాట ప్రకారం మూడువేల రూపాయల పెన్షన్‌ను ఆరువేల రూపాయలకు పెంచారని ఆనందం వ్యక్తం చేస్తూ దివ్యాంగులు బొబ్బిలిలో సంబరాలు చేసుకున్నారు. బొబ్బిలి ఇందిరమ్మ కాలనీలో గురువారం రాత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దివ్యాంగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చీమల రాంబాబు ఆధ్వర్యంలో చంద్రబాబుకు, స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనకు జేజేలు పలికారు. కార్యక్రమంలో దివ్యాంగులు టి.హరిబాబు, ఎన్.శ్రీనివాస్, కె.జగదీశ్వరరావు, బి.బాలరాజు, పాపారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు



విజయనగరం పట్టణంలోని డీఎస్సీ అభ్యర్థులు ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నగరంలోని శ్రీశ్రీ కోచింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న వారంతా గురువారం కేరింతలు కొడుతూ కనిపించారు. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు.

-విజయనగరం

హామీని నిలబెట్టుకున్న చంద్రబాబు..



ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ ప్రకారం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేయడం ద్వారా చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు. నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు తీపికబురు చెప్పారు. యువత భవిత బాబుతోనే సాధ్యం. మా కలలు ఫలించాయి.

-కాపారపు భారతి, బీఎస్సీ, బీఈడీ, మెంటాడ మండలం

భూములపై ధీమా కలిగింది..



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను చంద్రబాబు రద్దుచేయడంతో ఎంతో ఆనందంగా ఉంది. రైతుల భూమిపై వైసీపీ బకాసురల పెత్తనమేంటి. మా పాసు పుస్తకాలపై జగన్ బొమ్మేంటి. చట్టం రద్దుచేయడంతో మా భూములు మాచేతుల్లో ఉంటాయని నమ్మకం కలిగింది.

-రంది రాము రైతు, మెంటాడ మండలం

అన్న క్యాంటీన్ వచ్చేస్తోంది..



గతంలో తెలుగుదేశం ప్రభుత్వం తీసుకువచ్చిన అన్నా క్యాంటీన్‌లను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎత్తి వేసింది. దీనివల్ల ఎంతో మంది పేదలకు అందించే భోజనం దూరం చేశారు. పేదల ఆకలి తీర్చే విధంగా తిరిగి చంద్రబాబు వాటిని పునరుద్ధరించారు.

-లెంక బంగారునాయుడు, మదుపాడ, గజపతినగరం

ఐదేళ్లుగా ఎదురుచూపు..



ఉద్యోగ అవకాశాల కోసం ఐదేళ్లుగా నిరుద్యోగులు ఎదురు చూశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తానని మాట ఇచ్చిన చంద్రబాబు అన్నట్టే చేశారు. 16, 347 టీచర్ పోస్టులు భర్తీ అయితే వేల కుటుంబాలకు మేలు జరుగుతుంది.

-కన్నబాబు, కొనిస, గజపతినగరం

చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారాలు..



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అనేది ముమ్మాటికి భూ బకాసుర చట్టం. దాని నుంచి జనాలకు రక్షణ కల్పించిన దార్శనికుడైన సీఎం చంద్రబాబుకు సాష్టాంగ నమస్కారాలు చేయాల్సిందే. ఈ చట్టం అమలులో ఉంటే ముఖ్యంగా న్యాయవాదులకు జీవనాధారాన్ని కచ్చితంగా దూరం చేస్తుంది. ఈ చట్టం రద్దుకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షనీయం.

-గంటి గోపాలకృష్ణశర్మ, న్యాయవాది, బొబ్బిలి

చంద్రబాబును స్వాగతిస్తున్నాం..



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సి ఫైల్‌పై తొలి సంతకం చేయడాన్ని హర్షిస్తూ స్వాగతిస్తున్నాం. 16 వేలకు పోస్టులను ఒకేసారి భర్తీ చేయడం నిరుద్యోగలోకానికి ఊరట కల్పిస్తుంది. మిగిలిన ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను కూడా ఇదే మాదిరిగా భర్తీ చేయాలి.

-బి.సాయికిరణ్ యాదవ్, బొబ్బిలి

పింఛన్ పెంపు ఆనందదాయకం..



నేను నాయీబ్రాహ్మణ వృత్తిని సాగిస్తున్నాను. నా ఆదాయం అంతంత మాత్రమే. ప్రభుత్వం పెంచిన పింఛన్ గట్టిభరోసా ఇస్తుంది. నెలవారీ వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లను పెంచడం చాలా చాలా సంతోషం. చంద్రబాబు ఏదైనా సాధించి తీరుతారు.

-సుందరాడ బాబూరావు, జంగాల వీధి, బొబ్బిలి

ఎంతో సంతోషంగా వుంది..



వృద్ధాప్య, వితంతు పెన్షన్‌లు పెంచుతూ చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం ఎంతో ఆనందంగా వుంది. ఇచ్చిన మాటకు కట్టుబడి ఆయన పింఛను మొత్తం పెంచారు. ఆయన రుణం తీర్చుకోలేనిది.. మాలాంటి ఎంతో మందికి ఆయన సాయం చేసినట్టవుతుంది.

-పాలూరు ఆదిలక్ష్మి, జొన్నవలస

మాట నిలబెట్టుకున్నారు..



చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. పెన్షన్‌లు పెంచుతామన్నారు. పెంచారు.. టీవీల్లో చూస్తూ ఆనందంగా గడిపాం.. ఏప్రిల్ నెల నుంచే పెన్షన్ పెంచి ఇవ్వడం ఎంతో సంతోషం. చంద్రబాబు బాగుండాలి.. రాష్ట్రం బాగుండాలి.. ఈ విధంగా పాలన సాగితే రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

-పతివాడ కృష్ణవేణి



మోగిన బడి గంట

- మొదటిరోజు అరకొరగా హాజరు

కలెక్టరేట్, జూన్ 13: బండి గంట మోగింది. విరామం తర్వాత పాఠశాలలు కళకళలాడాయి. పిల్లలు తొలిరోజు ఇంటి దగ్గర కాస్త అయిష్టంగానే బయలుదేరినా బడికి వెళ్లేసరికి తోటి స్నేహితులను చూసి కేరింతలు కొట్టారు. ఉపాధ్యాయులు అందరి పేర్లు అడుగుతూ వారితో కలిసిపోయారు. దీంతో తొలిరోజు పిల్లలకు హాయిగా గడిచిపోయింది. దాదాపు 45 రోజులు తరువాత బడి తెరుచుకుంది. మొదటి రోజు చాలా తక్కువ సంఖ్యలో విద్యార్థులు వచ్చారు. రోజు, ముహూర్తం చూసి కొందరు పిల్లలను స్కూలుకు పంపుతుంటారు. ఆ ప్రకారం శుక్రవారం దాదాపు అందరూ పాఠశాలలకు వెళ్లే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలలకు హాజరైన విద్యార్థుల్లో కొంతమందికి స్టూడెంట్ కిట్లను విద్యా శాఖ పంపిణీ చేసింది.





నేలపైనే వైద్యం

పేరుకు ఏరియా ఆసుపత్రి. సేవలు మాత్రం దయనీయం. 30 పడకల ఆసుపత్రిని వంద పడకలుగా తీర్చిదిద్ది మెరుగైన వైద్యం అందజేస్తారని ఆశించిన రోగులకు అక్కడ నిరాశే ఎదురవుతోంది. గజతినగరం ఏరియా ఆసుపత్రిలో రోగులు విశ్రాంతి తీసుకోవడానికి మంచాలు లేవు. నేలపై బెడ్‌లు వేసి వైద్యం అందజేస్తున్నారు. చిన్న పిల్లల వార్డులో గురువారం కనిపించిన దృశ్యమిది. అక్కడ ఉన్నస్టాఫ్ మాత్రం మంచాలకు రంగులు వేశామని, ఆరిన తర్వాత మంచాలపై బెడ్‌లు వేస్తామని సమాధానమిచ్చారు. ఇతర వార్డుల నుంచి అయినా మంచాలు తేకుండా ఇలా అవస్థలకు గురి చేయడం తగదని రోగులు వాపోయారు.

- గజపతినగరం

వేటకు వేళాయే

- నేటి అర్ధరాత్రి తర్వాత సంద్రంలోకి మత్స్యకారులు

భోగాపురం, జూన్ 13: సముద్రంలో చేపల వేటకు సమయం వచ్చింది. విరామానికి గడువు తీరింది. రెండు నెలల తర్వాత తిరిగి వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత వేటకు వెళ్లనున్నారు. సంద్రంలో చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో చేపల ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని ఏటా ప్రభుత్వం వేటపై నిషేధం విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఏప్రిల్ 15నుంచి ఈనెల 14 వరకు సముద్రంపై చేపల వేట నిషేధం విధించారు. సుమారు 61 రోజుల పాటు మత్స్యకారులు వేటకు దూరంగా ఉన్నారు. ఆ సమయంలో చాలా మంది మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇంట్లో ఎంత మంది వేటకెళ్లినా మత్స్యకార భరోసా ఒకరికే మంజూరు కావడంతో పూర్తిస్థాయి ఆసరా కరువైంది. మత్స్యకారులు సముద్రాన్నే నమ్ము కొని మత్స్యసంపదను వేటాడుతూ జీవనం సాగిస్తుంటారు. నిషేధ సమయంలో ఇతర పనులు లేక ఇంటిపట్టునే ఉండిపోయారు. వేటకు సమయం సమీపించడంతో ఈనెల 15వ తేదీ వేకువజాము నుంచి వేట సాగించుకొనేందుకు అన్నిరకాలుగా సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు.



వేటకు వెళ్లేందుకు తీరంలో పడవలు, వలలను సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- 'ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఏడీఈఈ) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ.డిజైన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు-సీట్లు: బీఎఫ్ఏ కోర్సులో అయిదు స్పెషలైజేషన్లు ఉన్నాయి. రెగ్యులర్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 35, పెయింటింగ్ 20, స్కల్ప్చర్ 10, ఫొటోగ్రఫీ 30 సీట్లు ఉన్నాయి. ఎస్ఎస్ఎస్ కేటగిరీలో అప్లయిడ్ ఆర్ట్ 15, పెయింటింగ్ 15, స్కల్ప్చర్ 10, యానిమేషన్ 60, ఫొటోగ్రఫీ 20 సీట్లు ఉన్నాయి.

- బీ.డిజైన్ కోర్సులో ఇంటీరియర్ డిజైన్ స్పెషలైజేషన్ ఉంది. ఇందులో ఎస్ఎస్ఎస్ కేటగిరీ కింద 60 సీట్లు ఉన్నాయి.

ఎఫ్ఏడీఈఈ వివరాలు: ఎగ్జామ్‌లో భాగంగా ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్ పేపర్లు ఉంటాయి. బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు ఎ, బి, సి పేపర్లు; బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ) ప్రోగ్రామ్‌కు డి, ఇ పేపర్లు;



బీ డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌నకు ఎఫ్ పేపర్ రాయాల్సి ఉంటుంది.

- ఎ-పేపర్‌లో మెమొరీ డ్రాయింగ్ అండ్ కలరింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర
- బి-పేపర్‌లో ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం 50 నిమిషాలు
- సి-పేపర్‌లో ఆబ్జెక్ట్ డ్రాయింగ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనికి 100 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం గంటన్నర
- డి-పేపర్‌లో 100 మార్కులకు కంపోజిషన్ అండ్ విజువల్ కమ్యూనికేషన్ ఎగ్జామ్ ఉంటుంది. పరీక్ష సమయం గంటన్నర
- ఇ-పేపర్‌లో 50 మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం 50 నిమిషాలు
- ఎఫ్-పేపర్‌లో 200 మార్కులకు డిజైన్ సంబంధిత ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం మూడు గంటలు.
- ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 4
- **హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్:** పరీక్షకి నాలుగు రోజుల ముందు
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **ఎఫ్ఏడీఈఈ తేదీలు:** బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ), బీ.డిజైన్(ఇంటీరియర్ డిజైన్) ప్రోగ్రామ్‌లకు జూలై 20; బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్) ప్రోగ్రామ్‌లకు జూలై 21
- **వెబ్‌సైట్:** www.jnafauadmissions.com, www.jnafau.ac.in

తెలంగాణ డీఈఈ సెట్ నోటిఫికేషన్

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్య విభాగం - డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ డీఈఈ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలు సహా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్, మైనారిటీ, నాన్ మైనారిటీ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రతి ప్రైవేట్ కళాశాలలో 80 శాతం 'ఎ' కేటగిరీ సీట్లు, 20 శాతం 'బి' కేటగిరీ సీట్లు ఉంటాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లతోపాటు 'ఎ' కేటగిరీ సీట్లను సింగిల్ విండో సిస్టమ్ ద్వారా 'బి' కేటగిరీ సీట్లను కళాశాలల యాజమాన్యం నిర్ణయం మేరకు భర్తీ చేస్తారు. 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

టీజీ డీఈఈ సెట్ వివరాలు: డీఈఈ సెట్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో నిర్వహిస్తారు. డీఈఎల్ఈడీ ప్రోగ్రామ్ ఈ మూడు మాధ్యమాల్లో అందుబాటులో ఉంది. అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్ కోసం ఎంచుకొన్న మాధ్యమంలోనే డీఈఈ సెట్ రాయాల్సి ఉంటుంది. డీపీఎస్ఈ ప్రోగ్రామ్ ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఉంటుంది. ఇందులో చేరాలనుకొనేవారు డీఈఈ సెట్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలోనే రాయాలి. ఆంగ్ల మాధ్యమంలో డీఈఈ సెట్ రాస్తే రెండు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి అవకాశం ఉంటుంది.

- డీఈఈ సెట్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ నాలెడ్జ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్ నుంచి 10, జనరల్ తెలుగు(తెలుగు మాధ్యమం అభ్యర్థులకు)/జనరల్ ఉర్దూ (ఉర్దూ మాధ్యమం అభ్యర్థులకు) నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో ఎగ్జామ్ రాసేవారికి జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 ప్రశ్నలు, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. మూడో పార్ట్‌లో మేథమెటిక్స్ నుంచి 20, ఫిజికల్ సైన్సెస్ నుంచి 10, బయలాజికల్ సైన్సెస్ నుంచి 10, సోషల్ స్టడీస్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. రెండో పార్ట్‌లో జనరల్ ఇంగ్లీష్, జనరల్ తెలుగు/జనరల్ ఉర్దూ ప్రశ్నలను ఆ భాషల్లోనే ఇస్తారు. మిగిలిన రెండు పార్ట్‌లలో అన్ని ప్రశ్నలనూ అభ్యర్థులు ఎంచుకొన్న మాధ్యమంలో ఇస్తారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** deecet.cdse.telangana.gov.in/

సివిల్స్ ప్రిలిమ్స్ ప్రశ్నలు 'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BJhswiqలో చదవండి.

ముందుగానే దేవర రాక



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దేవర'. గురువారం చిత్రబృందం కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ చిత్రంలో తొలి భాగం 'దేవర: పార్ట్ 1'ను అక్టోబర్ 10న విడుదల చేస్తున్నట్లు గతంలో చిత్రబృందం ప్రకటించింది. అయితే ఇప్పుడు విడుదల తేదీ ముందుకు మారింది. సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు గురువారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో ఎన్టీఆర్ మాస్ లుక్‌లో కనిపించారు. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. ప్రకాశ్‌రాజ్, శ్రీకాంత్, నరైన్ కీలకపాత్రలు పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం'



ప్రేమ కథల్లో ఎక్కువగా నటించే సుధీర్‌బాబు.. రూటు మార్చి నటించిన కంప్లీట్ యాక్షన్ ప్యాక్‌డ్ చిత్రం 'హరోం హర'. ఈ చిత్రానికి జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించగా, సుమంత్.జి.నాయుడు నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా హీరో సుధీర్‌బాబు మీడియాతో ముచ్చటించారు. "హరోంహర' సరికొత్తగా చేసిన కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు ఈ కథా నేపథ్యం, మాటలు, సన్నివేశాలు కొత్త ప్రపంచాన్ని చూసిన అనుభూతిని ఇస్తాయి. నా దృష్టిలో కమర్షియల్ సినిమాల్లో కథ హీరో నుంచి మొదలైతేనే బాగుంటుంది. ఈ సినిమాను 'జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం' అనొచ్చు. ఇందులో నేను పోషించిన సుబ్రమణ్యం పాత్ర అన్ని వర్గాల ప్రేక్షకులకి నచ్చుతుంది. ఇప్పటివరకూ తెలుగులో వచ్చిన పది ఉత్తమ యాక్షన్ చిత్రాల్లో 'హరోం హర' ఒకటిగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. హీరోయిన్ మాళవిక శర్మ తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది" అని చెప్పారు.

ఈ ప్రశంసలు ఊహించలేదు



వంశీ జొన్నలగడ్డ దర్శకత్వంలో నూతన నటీనటులతో రూపొందిన చిత్రం 'నీ దారే నీ కథ'. ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, వేద్, అంజన బాలాజీ ప్రధాన పాత్రల్లో నటించారు. వంశీ జొన్నలగడ్డ, తేజేష్ వీర, శైలజ జొన్నలగడ్డ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రీమియర్ షో ఏర్పాటు చేశారు. ఈ షో ముగిశాక డైరెక్టర్ వంశీ మాట్లాడుతూ "సంగీతంలో అనుకున్నది సాధించడం కోసం నలుగురు యువకులు చేసే ప్రయత్నాల్ని అందర్నీ ఆకట్టుకునేలా, ఎంతో ఆసక్తికరంగా చూపించారని.. ప్రీమియర్‌లో సినిమాను చూసిన ప్రేక్షకులందరూ ప్రశంసిస్తున్నందుకు ఆనందంగా ఉంది. అందరూ సినిమాను ఇంతగా ఆదరిస్తారని అస్సలు ఊహించలేదు. థియేటర్లలోనూ ప్రేక్షకులు ఇదే విధంగా సినిమాను ఆదరిస్తారని కోరుకుంటున్నాను" అని అన్నారు.

బాలల పోరాటం



చిత్తజల్లు ప్రసాద్ దర్శకత్వంలో కేపీ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'బాలతేజం'. దిలీప్ రాథోడ్, ఇరిగే రమేష్, హీరోయిన్‌లుగా అరవింద, షన్ను, చెన్నకేశవ నాయుడు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గురువారం ఈ సినిమా షూటింగ్ కూకట్‌పల్లి-ఆల్విన్ కాలనీలో ప్రారంభమైంది. డ్రగ్స్ సరఫరా చేసి యువతను నిర్వీర్యం చేస్తున్న ముఠాపై బాలలు చేసిన పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా సినిమా ఉంటుందని డైరెక్టర్ చిత్తజల్లు ప్రసాద్ తెలిపారు.

రేవ్‌పార్టీ కేసులో నటి హేమకు బెయిల్



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్ట్ అయి జైలు జీవితం గడుపుతున్న నటి హేమకు ఊరట లభించింది. బుధవారం ఆమెకు బెయిల్ లభించింది. రేవ్ పార్టీలో డ్రగ్స్ వాడకంపై బెంగళూరు ఎన్‌డీపీఎస్ కోర్టులో విచారణ జరిగింది. 'హేమ డ్రగ్స్ వాడినట్లు పోలీసులు ఎలాంటి సాక్ష్యాలు న్యాయస్థానానికి సమర్పించలేదు' అని ఆమె తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. 'హేమపై ఆరోపణలు వచ్చిన పది రోజుల తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించారని, ఆమెకు నెగెటివ్ వచ్చిందని, ఆమె వద్ద ఎలాంటి డ్రగ్స్ లభించలేదు' అని న్యాయవాది కోర్టుకు నివేదించారు. సీసీబీ (బెంగళూరు నేర నియంత్రణ దళం) న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, 'హేమ మరికొంత మంది టాలీవుడ్ సినీ ప్రముఖులను ఈ పార్టీకి తరలించే ప్రయత్నం చేశారు, నోటీసులు పంపినా అనారోగ్య కారణాలను సాకుగా చూపి విచారణకు హాజరుకాలేదు, అందువల్లే ఆమెను అరెస్ట్ చేయాల్సి వచ్చింది' అని కోర్టుకు తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ఆమె ఏ క్షణంలోనైనా విడుదలయ్యే అవకాశాలున్నాయి. అరెస్ట్ తర్వాత తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ హేమ సభ్యత్వాన్ని రద్దు చేసింది.

అందాల రాక్సీ వచ్చింది



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తున్నారు. గురువారం దిశా పుట్టిన రోజు సందర్భంగా యూనిట్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇందులో ఆమె రాక్సీ అనే పాత్ర పోషిస్తున్నట్లు తెలిపింది. ట్రైలర్‌లో పోరాట ఘట్టాల్లో మెరిసిన దిశా ఈ పోస్టర్‌లో సైతం పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/XvNanAq లో చదవండి.

గ్రహణం వీడేనా?

- టిడ్కో గృహాల వైపు కన్నెత్తి చూడని వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ హయాంలోనే 80 శాతం పనులు పూర్తి
- 768 ఇళ్లు రద్దు చేసిన వైసీపీ సర్కార్
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు


టిడ్కో గృహ సముదాయం దుస్థితి

రాజాం రూరల్: వైసీపీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టింది. లబ్ధిదారులకు అయిదేళ్ల పాటు ఎదురుచూపులే మిగిలాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభించారన్న ఒకే ఒక్క నెపంతో ప్రభుత్వం అయిదేళ్లూ కక్ష సాధింపునకే పరిమితమైంది. 2015లో తెలుగుదేశం ప్రభుత్వం టిడ్కో గృహ సముదాయాల పనులు ప్రారంభించి సుమారు 80 శాతం పూర్తి చేసింది. ఇంతలో 2019 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వైసీపీ అధికారంలోకి వచ్చింది. కానీ ఈ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. అక్కడితో ఆగకుండా... రెండో విడతగా నిర్మించాల్సిన గృహాలను రద్దు చేసింది. బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులకు వడ్డీలు కడుతూ... ఉంటున్న ఇళ్లకు అద్దెలు చెలిస్తూ లబ్ధిదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రాష్ట్రంలో మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి రావడంతో లబ్ధిదారుల్లో తమ కల నెరవేరబోతోందనే ఆశలు చిగురిస్తున్నాయి.

1104 ఇళ్లు మంజూరు

రాజాం మున్సిపాలిటీ పరిధిలో కంచరాం గ్రామానికి కాస్త దూరంలో తెలుగుదేశం ప్రభుత్వం 1104 టిడ్కో ఇళ్లు మంజూరు చేసింది. మొదటిదశలో మూడు కేటగిరీలలో 336 ఇళ్లను నిర్మించారు. మొదటి కేటగిరిలో 96 ఇళ్లను ఉచితంగా, రూ.50 వేల బ్యాంకు గ్యారెంటీతో 48 ఇళ్లు, రూ.లక్ష బ్యాంకు రుణ సౌకర్యంతో 192 ఇళ్ల సముదాయాలకు సంబంధించి 80 శాతం పనులు పూర్తి చేశారు. పంపిణీ చేసే సమయంలో 2019లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అక్కడితో పనులకు బ్రేక్ పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత రెండు, మూడు దశల్లో నిర్మించాల్సిన 768 ఇళ్ల ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటికే పూర్తయిన నిర్మాణాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. టిడ్కో సముదాయ ప్రాంగణం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. రద్దు చేసిన ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు చెల్లించిన సుమారు రూ.కోటి డిపాజిట్ మొత్తాన్ని నేటికీ తిరిగి చెల్లించలేదు. వారిలో సుమారు 500 మందికి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చింది. కానీ స్థలం చూపించలేదు.

- ఇదిలా ఉంటే బ్యాంకుల నుంచి లబ్ధిదారులపై ఒత్తిడి పెరిగింది. తీసుకున్న రుణంపై వాయిదాతో పాటు వడ్డీ చెల్లించాలని బ్యాంకు అధికారులు డిమాండ్ చేయడం ప్రారంభించారు. దీంతో ఇటు ఇళ్లు రాక, అటు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటికి అద్దె, బ్యాంకు నుంచి తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లిస్తూ ఆర్థికంగా చితికిపోతున్నారు.

టీడీపీ ప్రభుత్వంపైనే ఆశలు

గతంలో తమకు ఇళ్లు మంజూరు చేసిన టీడీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో తమ కలలు నెరవేరే అవకాశం ఉందని లబ్ధిదారులు ఆశిస్తున్నారు. గతంలో రద్దు చేసిన ఇళ్లను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

బొబ్బిలి: ఉమ్మడి విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, మన్యంజిల్లా బలిజిపేట ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది.బొబ్బిలి విద్యుత్ డివిజన్ పరిధిలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ బలిజిపేట ఫీడరులో చేపట్టనున్న పలు మరమ్మతు, నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరాను శుక్రవారం నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సర ఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 33 కేవీ బలి జీపేట, వంతరాం, బొబ్బిలి మండలం పిరిడి, తెర్లాం మండలం నెమలాం, బాడంగి మండలం పినపెంకి సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా జరగదన్నారు. బొబ్బిలి పట్టణ పరిధిలోని ఫూల్‌బాగ్, మహారాణీపేట ప్రాంతాలలో కూడా అంతరాయం ఏర్పడుతుందన్నారు. ● **బాడంగి:** గజరాయనివలస సబ్ స్టేషన్ పరిధిలో గల ఎరుకులపాకలు, పెదపల్లి, తెంటువలస, పింద్రంగివలస, వీరసాగరం, డొంకినవలస రైల్వే స్టేషన్, డొంకినవలస, పిన్నవలస, కోడూరు అచ్చియ్యపేట, గొల్లలపేట, బ్రహ్మన్నవలసలకు శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. నిర్వహణ పనులలో భాగంగా సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్తు శాఖ అధికా రులు తెలిపారు.

జీవో నెంబరు 117ను రద్దు చేయాలి

విజయనగరం దాసన్నపేట: విద్యారంగాన్ని నాశనం చేసేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెంబరు 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఏవీఆర్‌కె ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలు, విద్యావేత్తలు, సంఘాల అభిప్రాయాలు తీసుకోకుండా ప్రపంచ బ్యాంకు డబ్బుల కోసం విద్యా రంగాన్ని నాశనం చేసేందుకు ఈ జీఓ తీసుకువచ్చారన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఈ జీవో రద్దు చేయాలని కోరారు.

పేద విద్యార్థికి పుస్తకాల వితరణ

విజయనగరం రూరల్: ఇటీవల పదో తరగతి పరీక్షల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన బూర లక్ష్మీనారాయణ ఇంటర్ చదివేందుకు ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో కణపాకకు చెందిన మారుతీ స్వయం సేవా సంఘం స్పందించి... వ్యాపారవేత్త చెరుకూరి శ్రీధర్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయంతో పుస్తకాలను సమకూర్చింది. ఈ కార్యక్రమంలో శ్రీధర్, మారుతీ స్వయం సేవా సంఘం ప్రతినిధులు గుత్తూరు చంద్రశేఖర్, నాగరాజు, మధు తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల వెలమలకు తీవ్ర అన్యాయం

కలెక్టరేట్: మంత్రివర్గం ఏర్పాటులో కొప్పులవెలమ కులానికి తీవ్ర అన్యాయం జరిగిందని కొప్పులవెలమ సామాజిక వర్గం జిల్లా అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద చూస్తే ఉత్తరాంధ్రలో కొప్పుల వెలమ జనాభా అధిక సంఖ్యలో ఉన్నారని, అందుకు తగిన విధంగా దివంగత నందమూరి తారకరామారావు హయాంలో నుంచి ఇప్పటి వరకూ మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం కల్పించారని పేర్కొన్నారు. ఈ సారి మాత్రం రాష్ట్రంలోని నలుగురు శాసనసభ్యులు గా ఎన్నికైన కూడా ఒక్కరిని కూడా మంత్రి వర్గంలో తీసుకోలేదన్నారు. ఈ విషయం చాలా బాధకు గురి చేసిందని, గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులను, అటుపోట్లను ఎదుర్కొని నిలబడి నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పందించి కొప్పుల వెలమలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు

విజయనగరం (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ రకాల సామాజిక పింఛనుదారులకు జూలై నెలతో అదనంగా మరో రూ.1000 కలిపి అందివ్వనున్నామని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి తెలిపారు. సామాజిక పింఛన్లను 4వేలకు పెంచనున్నట్టు సీఎం చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు జూలై ఒకటో తేదీ నుంచి జిల్లాలో రూ.4వేల చొప్పున అందించాలని నిర్ణయించారు. ఈ ఏడాది మే నెల నాటికి జిల్లాలో 2,82,194 మందికి రూ.3 వేలు పింఛను ఇస్తున్నారు. దీని కోసం ప్రతినెల రూ.82.45 కోట్లు వినియోగిస్తున్నారు. కొత్తగా పెంచిన ప్రకారమైతే జిల్లాలో ప్రతి నెల పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.117 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని పీడీ కళ్యాణ చక్రవర్తి తెలిపారు. ఒకటో తేదీ నుంచి వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు అందించనున్నట్టు తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు ఒక్కో వేయి చొప్పున కలిపి జూలైలో ఇస్తారు.

పాఠశాలలకు హాజరుకావాలి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు జూన్ 15 నాటికి హాజరు కావాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు అన్నదొర స్పష్టం చేశారు. గురువారం తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. పాఠశాల పునః ప్రారంభం దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా సంబంధిత ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. పాఠశాలకు వస్తున్న ప్రతి ఒక్క విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, ఎవరికైనా ఆరోగ్యం బాగోలేకపోతే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు మెనూ పక్కాగా అమలు చేయాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వారికి అవసరమైన స్టూడెంట్స్ కిట్స్ పూర్తిస్థాయిలో అందే విధంగా చూడాలన్నారు. ఈ ఏడాది కొత్తగా అడ్మిషన్ పొందిన విద్యార్థులు 20వ తేదీ నాటికి పాఠశాలకు హాజరు కావాలన్నారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ దేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యపై వినతి


ఏఈకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

భామిని: మండలంలోని బత్తిలి మేజర్ పంచాయతీలో ప్రజలు విద్యుత్ అంతరాయం, లోఓల్టేజీ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ట్రాన్స్‌కో ఏఈకు ప్రజలు నిలదీశారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు గురువారం బత్తిలి వెళ్లగా, గ్రామంలోని యువత ఆయన వాహనాన్ని ఆపి, తమ సమస్యలను వినతి పత్రం రూపంలో అందజేశారు. లోఓల్టేజ్ వల్ల ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయన్నారు. ఫ్యాన్లు తిరగడం లేదని, ఈ సమస్య చాలా రోజులుగా ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై ఏఈ స్పందిస్తూ పది రోజుల్లోగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

- విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు


మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, జూన్ 13: ఖరీఫ్‌నకు సంబంధించి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, ఎప్పటికప్పుడు ఈ విషయాల్లో రైతులకు సమాచారం ఇవ్వాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సూచించారు. గురువారం సాయంత్రం జొన్నవలస రైతు భరోసా కేంద్రం వద్ద మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయాధికారులు రామారావు, ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో విత్తనాలు, ఎరువులు అందితే రైతులకు సమయం, డబ్బు వృథా కావన్నారు. సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాలు అందజేస్తోందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, రైతులకు మేలు చేసే విధంగా వ్యవసాయాధికారులు కృషి చేయాలన్నారు. భూ సార పరీక్షలతో పాటు, ఆయా ప్రాంతాల్లో ఏ వంగడాలు అయితే.. తక్కువ పెట్టుబడి ఎక్కువ ఆదాయం వస్తుందో వాటిని రైతులకు అందించాలన్నారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేయాలన్నారు. ఏ గ్రామంలో, ఏ సమయంలో విత్తనాలు అందిస్తున్నదీ క్షేత్రస్థాయి అధికారుల ద్వారా రైతులకు తెలియజేస్తే, వారికి వ్యయ, ప్రయాసలు వుండవన్నారు. జిల్లా వ్యవసాయాశాఖాధికారి రామారావు మాట్లాడుతూ, ఖరీఫ్‌నకు సంబంధించి జిల్లాకు అవసరమైన అన్ని విత్తనాలు, ఎరువులకు సంబంధించి సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ రాజేశ్వర్మ, టీడీపీ మండల నాయకులు బొద్దల నర్సింగరావు, వేచలపు శ్రీను, మార్తి నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

రాజాం: సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై మొదటి సంతకం చేయడం అభినందనీయమని డీఎస్సీ అభ్యర్థులు తెలిపారు. ఈ నేపథ్యంలో పట్టణంలో కోచింగ్ సెంటర్‌లో డీఎస్సీ శిక్షణ పొందుతున్న అభ్యర్థులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ అభ్యర్థులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి ఐదేళ్లు గడిచినా ఇంతవరకూ ఒక డీఎస్సీ కూడా విడుదల చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 24 గంటలు కాకమందే డీఎస్సీపై సంతకం చేయడం నిరుద్యోగులు అదృష్టమని అన్నారు.

పవన్‌కు జనసేన నేత అభినందన


పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నేత బాబు దంపతులు

బొబ్బిలి, జూన్ 13: ఏపీ మంత్రిగా పదవి దక్కించుకున్న పవన్‌కల్యాణ్‌ను రాష్ట్ర జనసేన పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు-చాందిని దంపతులు గురువారం అమరావతిలో కలుసుకుని అభినందనలు తెలిపారు. జనసేన పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారం చేపట్టడంతో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలన్నీ నెరవేరేందుకు మార్గం సుగమమైందన్నారు. ప్రజల కష్టాలు తీరినట్టేనన్నారు. అరాచకపాలనకు చరమగీతం పాడేందుకు పవన్ కల్యాణ్ అహర్నిశలు ఎంతో శ్రమించారని, ఆయన కృషి ఫలితంగానే ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిందని బాబు అన్నారు.

కూటమి నాయకుల సంబరాలు


జామి మండలం లోట్లపల్లిలో కేకు కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

శృంగవరపుకోట రూరల్/జామి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జామి, శృంగవరపుకోట మండలాల్లో సంబరాలు ఇంకా కొనసాగుతున్నాయి. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో పూజలు చేసి, గ్రామాల్లో కేకులు కట్ చేసి.. బాణసంచా కాలుస్తున్నారు.

ఎక్కడ చెత్త కనిపించినా చర్యలు


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

రాజాం, జూన్ 13: ఏ వార్డులో చెత్త కనిపించినా చర్యలు తప్పవని పురపాలక సంఘం కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. గురువారం బాబానగర్, ఈశ్వర నారాయణ కాలనీ, తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వలు ఉండటంతో ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంలో సరైన చర్యలు తీసుకుని అన్ని ప్రాంతాల్లోనూ దోమల మందు పిచికారి చేయాలని ఆదేశించారు. గోతుల్లో మురుగునీరు నీల్వలు ఉంటే వాటిని తొలగించి బ్లీచింగ్ చెల్లించాలని ఆదేశించారు. తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రా నికి తరలించాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తది తరులు పాల్గొన్నారు.

కబ్జాపై కలెక్టర్ సీరియస్

- ఆర్డీవోతో ఎంక్వైరీకి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సూర్యకళ

విజయనగరం(ఆంధ్రజ్యోతి) జూన్ 13: నగరంలోని జర్నలిస్టులకు కేటాయించిన కాలనీలోని మిగులు స్థలం కబ్జా ఉదంతంపై ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన 'ఆ స్థలాలను ఎవరికిచ్చారు' అనే కథనానికి కలెక్టర్ నాగలక్ష్మి స్పందించారు. జర్నలిస్టుల కు కేటాయించిన స్థలం ఎంత?, మిగులు స్థలం ఎంత? మిగిలిన స్థలంలో ఇళ్లనిర్మాణాలు చేపట్టింది ఎవరు? వారు ఏ హక్కుతో ఆ స్థలంలో ఇళ్లనిర్మాణాలు చేపట్టారు.. తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపి వివరాలు అందచేయాలని విజయనగరం ఆర్డీవో సూర్యకళను ఆదే శించారు. దీంతో ఆమె గురువారం కేఎల్‌పురం, ఆర్డీవో కార్యాలయ సమీపంలోని జ ర్నలిస్టుల కాలనీని స్థానిక తహసీల్దార్, వీఆర్వో సర్వేయరుతో కలిసి పరిశీ లించా రు. ఈ సంద ర్భంగా ఆర్డీవో సూర్యకళ మాట్లాడుతూ 2006లో ప్రభుత్వం జ ర్నలిస్టుల ఇళ్ల స్థలా ల కోసం 30/20 సర్వే నెంబరులో స్థ లం కేటాయించింది. దీనిలో కొంతమంది మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మిగిలిన స్థలంలో ఈ మధ్య కాలంలో ఇతరులు ఇళ్ల నిర్మాణాలు చేప ట్టారు. ఏ హక్కుతో వారు ఇళ్లు నిర్మాణాలు చేపట్టారు.. భూమిపై వారికున్న హక్కు లు ఏమిటో పూర్తిగా విచారిస్తాం. కబ్జా జరిగినట్లు తెలితే చర్యలు తీసుకుంటాం అని ఆమె తెలిపారు. పూర్తి విచారణ జరిపి రెండురోజుల్లో కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని అన్నారు.

ఎన్‌సీసీ సేవలు అభినందనీయం


ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసాపత్రం అందిస్తున్న సీఐ

విజయనగరం క్రైం, జూన్ 13: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌సీసీ విద్యార్థుల సేవలు అభినందనీయమని వన్‌టౌన్ సీఐ వెంకటరావు కొనియాడారు. గురువారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఎన్నికల విధుల్లో సేవలు అందించిన ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించి, ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో పోలీసులతో సమానంగా, క్రమశిక్షణ అంకితభావంతో ఎన్‌సీసీ విద్యార్థులంతా విధులు నిర్వర్తించారన్నారు. ఇదే స్ఫూర్తి, క్రమశిక్షణను భవిష్యత్తులో కొనసాగించి, మరెన్నో బాధ్యతాయుత పదవులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ట్రైనర్ కల్యాణ చక్రవర్తి, ఎస్ఐలు తారకేశ్వరరావు, నరేష్, హరిబాబు నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

విజయనగరం క్రైం, జూన్ 13: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ ప్రతినిధులు సాయిరెడ్డి, కొసరాజు దుర్గాప్రసాద్‌లు డిమాండ్ చేశారు. గురువారం అయ్యన్నపేట సమీపంలోని మద్యం దుకాణం వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 580 మంది ఔట్ సోర్సింగు ఉద్యోగులు మద్యం దుకాణాల్లో పనిచేస్తున్నారన్నారు. నూతన మద్యం పాలసీ ద్వారా ప్రభుత్వ దుకాణాలు ఎత్తివేసి పాత విధానంలో కొనసాగిస్తారని ప్రచారం జరుగుతోందన్నారు. అదే జరిగితే తాము ఉద్యోగం కోల్పోయి తమతో పాటు, కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఉద్యోగ భద్రత కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు బెల్లాన మధుసూధనరావు, వసాది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌ని కలిసిన ఎంపీ కలిశెట్టి


అశోక్‌తో కలిశెట్టి

విజయనగరం రూరల్: టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతి రాజుని గురువారం ఆయన నివాసంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కలిశారు. కేంద్రమంత్రివర్గ ప్రమాణ స్వీకారం తదితర కార్యక్రమాలకు వెళ్లి తిరిగొచ్చిన ఆయన అశోక్‌ని కలిశారు. పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో పార్లమెంటులో ప్రస్తావించాల్సిన అంశాలను కూడా అప్పలనాయుడు అశోక్‌తో చర్చించారు.

కోళ్లను కలిసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు


ఎమ్మెల్యే లలిత కుమారితో ఎస్.కోట ఉద్యోగ, ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారిని లక్కవరపు కోటలోని తన నివాసంలో గురువారం శృంగవరపుకోట ఉద్యోగ, ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఇది చారిత్రక విజయమని.. దీనిలో ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వ్యాయామ ఉపాధ్యాయుడు పొట్నూరు శ్రీరాములు, ఉపాధ్యాయులు కె.మోహన్ రాజ్, ఇందుకూరి అశోక్‌రాజు, అప్పారావు తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ గేమ్ వివాదంతోనే బాలుడి హత్య

నెల్లిమర్ల: గత సోమవారం నాడు కొండపేట గ్రామానికి చెందిన బాలుడు కె.చైతన్య హత్యకు సంబంధించి అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఇన్‌చార్జి సీఐ కె.రామారావు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గత సోమవారం కొండపేట గ్రామానికి చెందిన చైతన్య హత్యకు గురయ్యాడు. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. దీనిపై వివరాలు సేకరించగా, అదే గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్లకు చైతన్యకు ఆన్‌లైన్ గేమ్ ఆడుతుండగా వారం కిందట వివాదం చెలరేగింది. చైతన్యపై కక్ష గట్టి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో వారు చైతన్యను గ్రామ సమీపంలో కొండ వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ కూడా వివాదం తలెత్తడంతో ఇద్దరు మైనర్లు చైతన్యను రాయితో మోది చంపేశారు. దీంతో నెల్లిమర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి, రిమాండ్ తరలించామని సీఐ తెలిపారు.

ఎమ్మార్సీ కేంద్రం తనిఖీ


ఎమ్మార్సీలో పాఠ్యపుస్తకాల గోదాంను పరిశీలిస్తున్న పాలక నారాయుడు

సీతంపేట: స్థానికంగా ఉన్న ఎంఆర్‌సీ కేంద్రాన్ని ఐటీడీఏ ఉప విద్యాశా ఖాధికారి పాలక నారాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీతంపేట మండలంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలకు సంబంధించి పాఠ్యపుస్తకాలు ఇండెంట్ ప్రకారం అందుబాటులో ఉన్నాయా లేదా అన్నదానిపై ఎంఈవో ఆనందరావును అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం అమలుపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బడి బయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించే విధంగా సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం సిరికొండ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఎంఆర్‌సీ సిబ్బంది కోటిబాబు, రాములమ్మ, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ సమస్యతో బండి వద్దకు రావాల్సిందే


బియ్యం కోసం వాహనం దగ్గరకు వచ్చిన గిరిజనులు

సాలూరు రూరల్: బియ్యం కోసం సాలూరు మండలం శిఖపరువు గిరిజనులు ఎండీయూ వాహనం వద్దకే రావాల్సి వస్తుంది. శిఖపరువు గ్రామానికి మొబైల్స్ సిగ్నల్ అందడం లేదు. ఈ ప్రాంతం షాడో ఏరియాలో ఉంది. దీంతో గ్రామానికి దూరంగా నిమ్మలపాడు వరకు ఎండీయూ వాహనం వస్తుంది. శిఖపరువు గిరిజనులు అక్కడే వచ్చి బియ్యం తీసుకోవాల్సి ఉంది. బియ్యం పంపిణీకి గురువారం వాహనం నిమ్మలపాడు వద్దకు రాగా, గిరిజనులు నడిచి వచ్చి రేషన్ తీసుకున్నారు. సిగ్నల్ సమస్య తీర్చడానికి అధికారులు ప్రయత్నించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతం చేయాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో మంజూరు చేసిన ఇంకుడు గుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ డి.ప్రభాకరరావు ఆదేశించారు. గొట్టివలస అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతల పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో శాశ్వత అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని చెప్పారు. వర్షాకాలం సమయంలో కేంద్రాల పరిధిలో నీరు నిల్వ నెలకొనకుండా నేరుగా ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఒక్కొక్క గుంతకు రూ.16వేలు మంజూరు చేశారని చెప్పారు. ఈ పరిశీలనలో జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు, సర్పంచ్ బి.చంద్రినాయుడు, అంగన్‌వాడీ కార్యకర్త పి.మీనాక్షి, తదితరులు ఉన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

పార్వతీపురంటౌన్: వచ్చే వర్షాకాలంలో సంపూర్ణంగా తాగునీటిని అందించేందుకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ప్రధాన పంప్‌హౌస్ వద్దగల ఇన్‌ఫిల్టర్ బావులకు నాగావళి నది నీరు ఎలా అందుతుందనే దానిపై ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది తోటపల్లి బ్యారేజీ నీరు వ్యవసాయానికి విడుదల చేసి ప్రధాన పంప్‌హౌస్ వైపు గేట్లు మూసి వేయడం వల్ల పట్టణ ప్రజలకు తాగునీటిని సకాలంలో అందించలేక పోయామన్నారు.

పనులు పూర్తి కాకుండానే బీటలు!

● జాతీయ కారిడార్ రహదారి నిర్మాణంలో నాణ్యతా లోపం

గంట్యాడ: మండలంలోని రామవరం నుంచి బొడ్డవరం మీదగా చిలకలగెడ్డ వరకూ నిర్మిస్తున్న జాతీయ రహదారి కారిడార్ పనుల్లో నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయి. ఒక వైపు పనులు జరుగుతుండగా మరోవైపు పనులు పూర్తయిన చోట బీటలు వారుతున్నాయి. ఈ నిర్మాణ పనులపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామవరం నుంచి బొడ్డవరం మీద చిలకలగెడ్డ వరకూ 26 కిలో మీటర్లు పొడుగునా(ఎన్‌హెచ్-516ఇ) రహదారి విస్తరణ పనులు గత మూడు సంవత్సరాల నుంచి జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ పనులు చివరి దశకు వచ్చాయి. రూ.81.64 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయి. ప్రధానంగా కొటారుబిల్లి, తామరాపల్లి, నరవ కూడళ్లలో రహదారికి ఇరువైపులా రోడ్డుపై వర్షం నీరు వెళ్లడానికి కల్వర్టులు వేశారు. ఈ కల్వర్టులపై పాదచారులు నడవటానికి వీలుగా టైల్స్‌తో రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ పనుల్లో నాణ్యతకు తిలోదకాలు వదిలినట్లు తెలుస్తోంది. టైల్స్ వేయడానికి ఇరువైపులా నిర్మిస్తున్న గట్లు నాణ్యంగా నిర్మించలేదు. వీటిని పైపైన నిర్మించడంతో కొన్ని చోట్ల వెంట వెంటనే కూలిపోతున్నాయి. పనులు చేసిన ప్రతిచోట ఇదే పరిస్థితి కనిపిస్తోంది. టైల్స్ వేసే చోట నాణ్యత లేనట్టు తెలుస్తోంది. ఇలా చేయడం వల్ల పెద్ద పెద్ద వర్షాలు కురిస్తే కుంగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పనులు నాణ్యతగా ఉండే విధంగా చూడాలని స్థానికులు కోరుతున్నారు.


కొటారుబిల్లి కూడలి వద్ద టైల్స్ కోసం దిమ్మలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


టైల్స్ ఏర్పాటు చేసిన తర్వాత బీటలు వారిన దృశ్యం

మాట తప్పని చంద్రబాబు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున


మాట్లాడుతున్న నాగార్జున

చీపురుపల్లి: ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ జీవోపై తొలి సంతకం చేయడం హర్షణీయమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న చంద్రబాబు 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేశారని చెప్పారు. రాష్ట్రంలోని నిరుద్యోగ ఉపాధ్యాయులకు దీంతో న్యాయం చేశారన్నారు. అదే విధంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, అన్న క్యాంటిన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సస్ దస్త్రాలపై సంతకాలు చేయడం గొప్ప విషయమన్నారు. తొలి రోజున ఆయన తీసుకున్న నిర్ణయాల పట్ల ప్రజలు జేజేలు పలుకుతున్నారని నాగార్జున అన్నారు. కూటమి నేతృత్వంలో మన రాష్ట్రంలో ప్రగతి పథంలో పరుగులు తీస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. కూటమి తరపున జిల్లా నుంచి మంత్రి పదవులు పొందిన వారికి నాగార్జున శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

విజయనగరం రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు వేమలి చైతన్యబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెట్టారని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ వల్ల ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధ్యాయ అవకాశాలు కలుగుతాయన్నారు. అదే విధంగా ల్యాండ్ టైటిల్లింగ్ యాక్టు, పెన్షన్ పెంపు తదితర అంశాలపై చంద్రబాబు సంతకాలు చేశారన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన


మధుపాడలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గజపతినగరం: గ్రామాల్లో బీసీజీ వ్యాక్సిన్ పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి అర్హులైన వారికి వ్యాక్సిన్ వేసుకునేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా టీబీ కంట్రోల్ అధికారిణి రాణి అన్నారు. మండలంలోని మధుపాడ గ్రామంలో గురువారం బీసీజీ వ్యాక్సిన్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో టీబీ మందులు వాడినవారు, 60ఏళ్ల పైబడినవారు, షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు ప్రస్తుతం టీబీ మందులు వాడుతున్నవారు, బరువు తక్కువగా ఉన్న వాళ్లకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్ వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికృష్ణారెడ్డి, అనూజ్‌రాయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూట్ యాజమాన్యంపై కేసులు నమోదు చేయండి


మాట్లాడుతున్న శంకరరావు, గోపాలం

బొబ్బిలి: కార్మికుల పీఎఫ్ బకాయిలను చెల్లించకుండా మోసం చేసిన శ్రీలక్ష్మీ శ్రీనివాసా జూట్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకర రావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువా రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూట్ కార్మికులకు పీఎఫ్ బకాయిల చెల్లింపునకు 2019లో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో ఒప్పందం కుదిరిందన్నారు. 2020 ఫిబ్రవరి కల్లా చెల్లింపులను పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. పీఎఫ్ బకాయిలను చెల్లించని కారణంగా 50 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్ రావడం లేదన్నారు. నూతన ఎమ్మెల్యే బేబీనాయన కార్మికుల పీఎఫ్ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని శంకరరావు కోరారు. ఈ సమావేశంలో ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

గొడుబంద స్థలం పరిశీలన


గొడుబంద పరిశీలనలో ఆర్డీవో

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామంలో ఆక్రమణకు గురైన గొడుబంద స్థలాన్ని విజయనగరం ఆర్డీవో సూర్యకుమారి గురువారం పరిశీలించారు. ఈ గొడుబంద గ్రామానికి చెందిన బ్రాహ్మణ కులానికి చెందిన వేలూరి కుటుంబానికి చెందినదిగా రెవెన్యూ అధికారులు అప్పట్లో గుర్తించడం, ఈ బంద దిగువన సాగు భూములు లేకపోవడం, ఉన్నా ఆ భూములు వేలూరి కుటుంబానికి చెందినవి కావడంతో ఆ కుటుంబానికి చెందిన రెవెన్యూ అధికారుల పరిశీలన అనంతరం వారు ఆక్రమించుకుని ఇంటి స్థలాలుగా విభజించుకున్నారు. దీనిపై గ్రామానికి చెందిన రుద్ర వెంకటలక్ష్మి హైకోర్టును ఆశ్రయించగా కోర్టు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నివేదిక అందజేయాలని కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విజయనగరం ఆర్డీవో.. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవిన్యూ సిబ్బందితో కలిసి గొడుబందను పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య


విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న జేసీరాజు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని నాయుడువలస పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయులు జేసీ రాజు తెలిపారు. గురువారం ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు నైతిక విలువలు కూడా ప్రభుత్వ పాఠశాలలోనే అందుతాయన్నారు. ప్రైవేటు పాఠశాలల వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ప్రశ్నించే తత్వం కోల్పోతారన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

● 200 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి కసరత్తు


పండ్ల తోటల్లో ఉపాధి పనులు చేపడుతున్న దృశ్యం

బొబ్బిలి: ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించనున్నారు. కనీసం 25 సెంట్ల నుంచి ఐదెకరాల వరకు పండ్ల తోటలు వేసుకునేందుకు ఈ పథకంలో వెసులుబాటు ఉంది. తమ పొలాల్లో పండ్ల తోటలను వేసుకోవాలనే ఆసక్తి కలిగిన రైతులు ఉపాధి హామీ సిబ్బందిని కలిసి భూమికి సంబంధించిన 1బి, పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తే వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. జీడి, మామిడి, సపోటా, జామ, మునగ, పామాయిల్ తదితర పండ్లతోటలు వేసుకునేందుకు మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం చెల్లిస్తుంది. మొక్కలు నాటేందుకు అవసరమైన గుంతలు తవ్వడం, మొక్కలను ఉద్యానక్షేత్రం నుంచి పంపిణీ చేయడం, ఏడాదిలో 8 నెలల పాటు మొక్కలకు నీరు పోయడం, వాటి సంరక్షణ తదితర వాటికి నిధులు చెల్లిస్తారు. సంరక్షణ, నిర్వహణకు సంబంధించి వేతనదారులకు పనిదినాలను కల్పిస్తారు. బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీఓ రవికుమార్ సమావేశం నిర్వహించి హార్టికల్చర్ ప్లాంటేషన్‌పై దిశానిర్దేశం చేస్తున్నారు. మండల పరిధిలో 200 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటల పెంపకం ప్రక్రియను ముమ్మరం చేయాలని తెలిపారు. ఈ విషయమై ఏపీఓ లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ అన్ని రకాల పండ్లతోటలతో పాటు మునగ పంటను ఈ పథకంలో సాగు చేసుకోవచ్చని తెలిపారు.

జేఎస్ఎల్ కర్మాగారం చర్చలు విఫలం

కొత్తవలస: జిందాల్ నగర్‌లోనున్న జేఎస్ఎల్ కార్మికులకు, యాజమాన్యానికి మధ్య చర్చలు మరోసారి విఫలమయ్యాయి. గురువారం కర్మాగారంలో కొత్తవలస సీఐ వి.చంద్రశేఖరరావు సమక్షంలో మూడు కార్మిక సంఘాల నాయకులకు, యాజమాన్యానికి మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చలలో 264 మంది ఉన్న కాంట్రాక్టు కార్మికులలో సగం మందికి మాత్రమే 15 రోజులు పని కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని యాజమాన్య ప్రతినిధులు కార్మిక సంఘాలకు తెలిపారు. అందుకు అంగీకరిస్తే కర్మాగారంలో విధించిన షట్టింగ్ డౌన్ ఎత్తి వేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్మిక సంఘాలు మాత్రం కార్మికులందరికీ పని కల్పించాలని, లేకపోతే అందరికి లేఆఫ్ ఇవ్వాలని డిమాండ్ చేశాయి. కార్మికులందరికీ లేఆఫ్ ఇవ్వలేమని, అందరికీ 15 రోజులు పని కల్పించలేమని యాజమాన్యం స్పష్టం చేసింది. చర్చలు విఫలం కావడంతో నిరసన కార్యక్రమాలను కొనసాగించనున్నట్టు కార్మికులు తెలిపారు. ఈ సమావేశంలో యాజమాన్యం తరపున దినేష్ శర్మ, గోపాలకృష్ణ పాల్గొనగా... కార్మిక సంఘాల తరపున పిల్లా అప్పలరాజు (టీఎస్‌టీయూసీ) నెక్కల నాయుడుబాబు, వామాలు (వైసీపీ ట్రేడ్ యూనియన్), గాడి అప్పారావు, నమ్మి చినబాబు(సీఐటీయూ) హాజరయ్యారు.

కార్మిక సంఘాల ఆందోళనకు మద్దతు

గత 28 రోజులుగా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జేఎస్ఎల్ కర్మాగారంలోని మూడు కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళనకు పూర్తి మద్దతు ఇస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. గురువారం జేఎస్ఎల్ కర్మాగారం మెయిన్ గేట్ వద్ద నిరసన శిబిరానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కర్మాగారంలో లాకౌట్ విధించి సుమారు నెల రోజులు కావస్తోందని, కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కొందరికి మాత్రమే లే ఆఫ్ ఇస్తానని యాజమాన్యం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు గాడి అప్పారావు, పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు, బూసాల అప్పారావు, జి.వెంకటరావు, జి.బి.నాయుడు, సలాది బీమయ్య, లగుడు వామాలు, బాలిబోని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన శిబిరంలో మాట్లాడుతున్న మర్రాపు సూర్యనారాయణ

- మర్రాపు సూర్యనారాయణ, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ఉపాధ్యక్షుడు

పుస్తకాల పంపిణీ సక్రమంగా చేపట్టాలి

● రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి కల్పన

నెల్లిమర్ల: నెల్లిమర్ల బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని విద్యా సామగ్రి పంపిణీ కేంద్రాన్ని రాష్ట్ర అకడమిక్ మోనటరింగ్ అధికారి కల్పన గురువారం సందర్శించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు అవసరమైన పుస్తకాల సంఖ్య, మండలానికి చేరిన పుస్తకాలు, పంపిణీ విధానం తదితర విషయాలపై ఆరా తీశారు. ఎంఈవో-2 ఈపు విజయ్‌కుమార్‌ను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాల పంపిణీ సక్రమంగా చేపట్టాలన్నారు. ప్రతి విద్యార్థికీ పుస్తకాలు చేరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.వెంకటరమణ, సీఎంవో ఆదినారాయణ హాజరయ్యారు. ఎంఈవో విజయ్‌కుమార్‌తో పాటు సీఆర్పీలు బి.వెంకటరమణ, మొయిద అచ్చింనాయుడు, గురుగుబిల్లి లక్ష్మణరావు, ఈశ్వరరావు, రేవతి తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి మండలంలోని పాఠశాలలకు వచ్చిన విద్యార్థుల కిట్లను గురువారం స్టేట్ అకడమిక్ మోనటరింగ్ అధికారి కల్పన గురువారం పరిశీలించారు. మండలంలోని 96 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు యూనిఫాం దుస్తులు మినహా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్టులు తదితర కిట్లు స్టాకు పాయింట్లకు చేరుకున్నాయి. స్థానిక గొల్లపల్లి మున్సిపల్ హైస్కూలు, పిరిడి జడ్పీ ఉన్నత పాఠశాలల్లోగల స్టాకు పాయింట్‌లో ఆమె కిట్లను పరిశీలించారు. వాటన్నిటినీ సక్రమంగా విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంఈవోలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసు, హెచ్‌ఎంలు ఉన్నారు.


పుస్తకాల పంపిణీపై ఎంఈవోను ఆరా తీస్తున్న కల్పన

కూటమి విజయంతో రక్తదాన శిబిరం

భోగాపురం: ముంజేరు సమీప మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ ఉద్యోగులు గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కూటమి ఘన విజయం సాధించడంతో పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు, మంత్రిగా పవన్ కళ్యాణ్, నెల్లిమర్ల ఎమ్మెల్యేగా లోకం నాగమాధవి ఘన విజయం సాధించడంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈశిబిరంలో 50 యూనిట్ల రక్తం ఇచ్చామని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ అధినేత లోకం ప్రసాదు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రి మండలి సభ్యులకు అభినందన

శృంగవరపుకోట: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఏర్పడిన నూతన మంత్రి మండలిని గురువారం ఓటరు అక్షరాస్యత వేదిక అభినందించింది. శృంగవరపుకోటలో సమావేశమైన వేదిక సభ్యులు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టడంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు, సభ్యులు ఎం.ఎస్.ఎన్.మూర్తి, సీహెచ్ రామకృష్ణ, లంక సాంబమూర్తి, రెడ్డి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన ఓటరు అక్షరాస్యత వేదిక సభ్యులు

అచ్చెన్నను కలిసిన బంగార్రాజు

భోగాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు విజయవాడలోని ఆయన స్వగృహంలో గురువారు కలిశారు. ఈసందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.


అచ్చెన్నాయుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న బంగార్రాజు

మొక్కు తీర్చుకున్న వీరాభిమాని


మొక్కు తీర్చుకున్న కుమార్

బొబ్బిలి: రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు, బొబ్బిలిలో ఎమ్మెల్యేగా బేబీనాయన గెలుపొందాలని కోరుకున్న ఓ వీరాభిమాని తన మొక్కును తీర్చుకున్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ లోచర్ల కుమార్ ఎన్నికల సమయంలో బొబ్బిలి నుంచి సింహాచలం వరకు కాలి నడకన వెళ్లి బేబీనాయన గెలుపు కోసం సింహాద్రి అప్పన్నకు మొక్కుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు బేబీనాయన గెలుపొందడం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అత్యధిక స్థానాలను సాధించడంతో కుటుంబ సభ్యులతో సహా తిరుమల వెళ్లి శ్రీవేంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించారు.

విత్తనాల కోసం నమోదు తప్పనిసరి

చీపురుపల్లి: వరి విత్తనాలు కావలసిన వారు సంబంధిత ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి రఘునాథ్ తెలిపారు. చీపురుపల్లిలోని ఐదో నెంబరు సచివాలయం పరిధిలో వరి విత్తనాల మొలక శాతం పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ప్రస్తుతం ఆర్బీకేల్లో ఎంటీయూ-1121, బీపీటీ-3291, ఆర్ఎన్ఆర్-10 రకాలు అవసరమైన వారు ఆయా ఆర్బీకేల్లో నమోదు చేసుకోవాలని ఏవో తెలిపారు.

విత్తనాలు అందరికీ పంపిణీ చేయాలి

జామి: మండలంలోని రైతులందరికీ వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో విత్తనాలు అందించాలని టీడీపీ నాయకులు బాలాజీ, గోవింద, మురళి తదితరులు కోరారు. గురువారం చింతాడలో ఆర్బీకే ద్వారా రైతులకు మండల వ్యవసాయ శాఖ విత్తనాలు పంపిణీ చేసింది. సర్పంచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

గుర్ల: భూపాలపురం గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి అనే యువతి ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయాలపాలై విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను చీపురుపల్లి నియోజకవర్గ నందమూరి సేవా సమితి సభ్యులు గురువారం పరామర్శించి, రూ.10వేలు అందజేశారు. సేవ సమితి అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి నాగులపల్లి నారాయణరావు, స్టేట్ కన్వీనర్ ఎం.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై హర్షం

కొత్తవలస: ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేస్తూ సంతకం చేయడం పట్ల కొత్తవలస న్యాయవాద సంఘం హర్షం వ్యక్తం చేసింది. న్యాయవాద సంఘ అధ్యక్షురాలు డీవీఎల్ దేవి, మాజీ ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ గిరిబాబు, మాజీ ఏజీపీ గొడుగుల మహేంద్ర, సంఘ సభ్యులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్టం రద్దు రైతులకు వరమన్నారు. పేదల భూములను కాజేయడానికే ప్రణాళిక ప్రకారం గత వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు.